# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భవిష్యత్ లో ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా బ్రిక్స్ కూటమి మరింత శక్తివంతంగా ఆవిర్భవిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు.
- ❖ ఆయుష్మాన్ భారత్ పథకం సామాజిక భద్రతా కార్యక్రమాలలో అత్యుత్తమమైనదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.
- ❖ భారతదేశపు వార్షిక ఇంధన దిగుమతులను తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.
- ❖ దానా తుఫాను దృష్ట్యా ఒడిస్సా లోని 14 ప్రభావిత జిల్లాలో ప్రజలను ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.

========================

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ సభ్య దేశాలు ఏకతాటిపైకి రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కోరారు. ఇలాంటి తీవ్రమైన అంశాలపై ద్వంద్వ వైఖరికి తావు లేదన్నారు. రష్యాలోని కజాన్ లో జరుగుతున్న 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు ప్లీనరీ సెషన్ లో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ... భారతదేశంలో హరిత వృద్ధి, వాతావరణ-స్థితిస్థాపక మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. భారత్ లో మల్టీమోడల్ కనెక్టివిటీని వేగంగా పెంచడానికి “గతిశక్తి” పోర్టల్ ను రూపొందించామన్నారు. బ్రిక్స్ కూటమి గత 2 దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలు సాధించిందని భవిష్యత్ లో ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవటానికి ఇది మరింత ప్రభావవంతమైన మాధ్యమంగా ఆవిర్భవిస్తుందని నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

========================

“దానా” తుఫాను రేపు అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజామున ఒడిశా తీరంలోని భితార్కానికా, ధమ్రా మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తీరం దాటే సమయంలో ఈదురు గాలులు గంటకు 100 నుండి 120 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది. “దానా” ప్రభావంతో ఈరోజు మధ్యాహ్నం నుండి ఒడిశాలోని కేంద్రపారా, జగత్‌సింగూర్ జిల్లాల్లో వర్షాలతో పాటూ బలమైన గాలులు ప్రారంభమయ్యాయి. ఒడిశా ప్రభుత్వం జగత్‌సింగ్‌పూర్, కేంద్రపారా, భద్రక్, బాలాసోర్ తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. తుఫాను దృష్ట్యా 14 తీరప్రాంత జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు ఈరోజు నుండి 3 రోజుల పాటు సెలవు ప్రకటించారు. భారీ సంఖ్యలో పలు రైళ్లను ఈస్ట్ కోస్ట్ రైల్వే రద్దు చేసింది. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలోని భితార్కానికా జాతీయ పార్క్ పై తుఫాను ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఆ పార్కులోని జంతువులను ఇతర జాతుల వృక్షజాలం, జంతుజాలాన్ని రక్షించడానికి అటవీ అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

========================

ఆయుష్మాన్ భారత్ పథకం సామాజిక భద్రతా కార్యక్రమాలలో అత్యుత్తమమైనదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఎటువంటి షరతుల్లేకుండా 70 సంవత్సరాలుపై బడిన వారందరికీ పథకాన్ని వర్తింప చేస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 6.3 కోట్ల ఆసుపత్రులు సేవలందిస్తున్నాయని నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తూ…

(వాయిస్ 37 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

========================

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షులు జిన్ పింగ్ తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 2019లో బ్రెసిలియాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం తరువాత ప్రతినిధుల స్థాయిలో వీరిద్దరి మధ్య జరిగిన తొలి ద్వైపాక్షిక సమావేశం ఇది. సాయుధ బలగాల ఉపసంహరణ, గస్తీ ఒప్పందం, 2020లో భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో తలెత్తిన సమస్యల పరిష్కారం నేపథ్యంలో ఈ సమావేశం జరిగిందని భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలియజేస్తూ…

(వాయిస్ 26 సెకన్లు)

========================

ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్ కోసం జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ 3 రోజుల పర్యటన నిమిత్తం రేపు భారత్ కు రానున్నారు. ఈ పర్యటన లో భాగంగా అక్టోబర్ 25న జరగనున్న ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్ (ఐజీసీ) 7వ ఎడిషన్ కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి అధ్యక్షత వహిస్తారు. మెరుగైన భద్రత, రక్షణ సహకారం, సుస్థిర

అభివృద్ధి భాగస్వామ్యం, వ్యూహాత్మక సాంకేతికతల సహకారం వంటి కీలక అంశాలపై ఇరు దేశాల నాయకులు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

=========================

భారతదేశ వార్షిక ఇంధన దిగుమతులను 22 లక్షల కోట్ల రూపాయలకు తగ్గించాలని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఐఐటి కాన్పూర్ నిర్వహించిన వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇంజినీరింగ్ అసెట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ.. భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంలో సాంకేతికత చాలా కీలకమన్నారు. ఇంజనీరింగ్ ఆస్తుల నాణ్యతను నిర్వహించడానికి ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. పరిశోధకులు, శిక్షకులకు మేధోపరమైన సంభాషణలో పాల్గొనడానికి ఇది మంచి వేదికగా ఉపయోగపడుతుందని నితిన్ గడ్కరీ పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

=========================

ఢిల్లీలో గాలి నాణ్యత చాలా పేలవమైన కేటగిరీలో కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం, దేశ రాజధానిలో వాయు నాణ్యత సూచిక ఈరోజు మధ్యాహ్నం 367 వద్ద నమోదైంది. వాయు కాలుష్యాన్ని అరికట్టే చట్టాన్ని అమలు చేయడానికి అవసరమైన యంత్రాంగాన్ని రూపొందించకుండానే కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ చట్టాన్ని రూపొందించారని సుప్రీంకోర్టు పేర్కొంది. వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టిన వారిపై పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఐశ్వర్య భాటి, 10 రోజుల్లో నిబంధనలను ఖరారు చేస్తామని, చట్టం పూర్తిగా అమలులోకి వస్తుందని కోర్టుకు హామీ ఇచ్చారు.

=========================

శ్రీ కర్తార్ పూర్ సాహిబ్ కారిడార్ ఒప్పందాన్ని మరో 5 సంవత్సరాల పాటు పొడిగించేందుకు భారత్ - పాకిస్థాన్ అంగీకరించాయి. కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ ద్వారా భారతదేశం నుండి గురుద్వారా దర్బార్ సాహిబ్ కర్తార్‌పూర్, పాకిస్తాన్‌లోని నరోవల్‌కు యాత్రికుల సందర్శనను సులభతరం చేయడానికి 2019 అక్టోబర్ 24వ తేదీన ఇరు దేశాలు ఐదేళ్ల కాలపరిమితితో ఒక ఒప్పందం చేసుకున్నాయి.

=========================

గోల్ఫ్ క్రీడకు సంబంధించిన 16వ మహిళల ఇండియన్ ఓపెన్ కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. హర్యానాలోని గురుగ్రామ్‌లో రేపు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో 31 దేశాల నుండి 114 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. హితాషీ బక్షి, వాణీ కపూర్, గౌరికా బిష్ణోయ్, అమన్‌దీప్ డ్రాల్, రిధిమా దిలావారీలతో కలిపి మొత్తం 27 మంది భారత్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

=========================

=========================